మంచు శిఖరం

'కొలకలూరి'

ముక్కాలి పీటమీద కూర్చున్న రమేష్, ఎదురుగా వున్న చెక్క పెట్టెమీద చేతిలోనికత్తి నిలువుగా పొడిచాడు. ఠకీమని శబంవచ్చింది.

వెనుక వెన్నెముకమీద ఏదో పెద్దబరువుబలంగా ప్రాకినట్లయింది. కరెంటు షాక్ లాగా త్రుళ్ళిపడ్డాడు. వళ్లుజలదరించింది. గగుర్పొడిచింది.

చెక్కపెట్టెలోనికి దిగినకత్తి గుడ్డిదీపం కాంతిలో తళుక్కు తళుక్కుమని మెరుస్తోంది.

శరీరంలోని రక్తాన్నంతటినీ కూడదీసి, చేతిలో కూర్చుకొని నరాలన్నీ బలంగాబిగబట్టి, కత్తిపిడిమీద చెయి వేశాడు రమేష్.

ముఖం నల్లగా బొగ్గులాగావుంది. కళ్లుకుంచించుకుపోయాయి. పళ్ళు నోటిలో ఒకదాన్ని మరొకటి బలంగా నొక్కుకుంటున్నాయి. మధ్యనున్న మెత్తని పెదాలు ఒత్తుకుపోతున్నాయి. ముక్కు పుటాలు కంపిస్తున్నాయి. నొసటిలో ముడతలు పడ్డాయి. వెంట్రుకలు జీరాడుతున్నాయి.

రమేష్ కుడిచెయ్యి కత్తి పిడిమీద బలంగా నొక్కిపట్టివుంది ఎడంచెయ్యి వెంట్రుకల్లో చొరబడి పిడికిలి ముడుచుకొంది. జుట్టు చిక్కుచిక్కుగా రేగింది.

'ఇవాళ రాత్రి చాడీశ్వరీ గుండెల్లో ఇది దూసుకుపోవలసిందే'

కత్తివైపు చూశాడు రమేష్. అతను స్థిరనిశ్చయం గలవాడు.

'పాపిష్టిపీనుగ! గుండెల్లోంచి దూరబడి వెన్నెముకను పగలదీసుకొని వీపుమీదగా రావాలి'

అతనిముఖం మినుకు మినుకు మనేదీపం కాంతిలో అస్పష్టంగా గోచరిస్తోంది. వెలుగునీడలలా వ్యాపిస్తున్నాయి. అతనిముఖంమీద చీకటి—కత్తిమీదవెలుగు—చీకటీ—వెలుగూ—.

'దానిరక్తంలో కత్తి స్నానంచేస్తుంది'

బలంగా వత్తిపట్టిన కత్తి చెక్కలోకి అరంగుళం దిగింది. తల క్రిందకువ్రాలింది. కత్తి పిడిమీద పిడికిలి, పిడికిలిమీద నొసలు.

'దానిముఖం చెక్కాలి'

ఠక్కునకత్తిపుచ్చుకున్నాడు. మరోక్షణంలో నెమ్మదిపడ్డాడు. కార్యక్రమ మాలోచించుకున్నాడు. దీపం వెలుగుతోంది. వెలుగు ముఖంమీద పడుతోంది ఆలోచిస్తున్నాడు.

ఇవాళఉదయమే తను కలకత్తా పోతున్నట్లు చాడీశ్వరితో చెప్పాడు. అందుకుతగ్గట్టే కలకత్తా ట్రెయిన్‌లో బెర్తు రిజర్వు చేయించుకున్నాడు. మరో కజిన్ని తనటికెట్టుమీద కలకత్తా పంపుతున్నాడు. తను వ్రాసి వాడికిచ్చిన వుత్తరం కలకత్తాలో వాడు పోస్టు చేస్తాడు. చాడీశ్వరి హత్యతో తనకే ప్రమేయమూ లేనట్టు గట్టిగాసాక్ష్యం. అది తనతో నువ్వు కలకత్తా వెళ్ళవద్దు అంది. దానిమీదట తను తిరస్కరించాడు. అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. బయలుదేరినట్లుకూడా కబురుచేశాడు. సాయం సమయం దాటింది. వూళ్లో వున్నట్లు ఎవరికీ తెలియకూడదు. వూరికి కొంచెం ప్రక్కగావున్న హాల్లోపిక్చరుకెళ్లి, బాక్స్‌లోంచి మధ్యలోనే బయటకువచ్చాడు. తనువూళ్లో తన విషయం తెలిసిన చాడీశ్వరి తప్పకుండా వాణ్ణి మేడలోకి పిలపించుకుంటుంది. దొరికిపోతుంది ద్రోహి, నమ్మకహరాం. తప్పకుండా దొరికిపోతుంది. రమేష్ పళ్ళు పటపట లాడించాడు. చప్పున పైకిలేచాడు. చకచకా నాలుగడుగులు తలుపుదాకా వేశాడు. తలుపుదగ్గర కొంచెంసేపాగి, తిరిగివచ్చి కూర్చున్నాడు.

'వాళ్ళిద్దరూ ఇంటివద్ద దొరికిపోతారు. వీలుంటే వాడు కూడా సఫా'

"చేతిలోని కత్తి ఒక్కసారిగా గట్టిగా వత్తాడు"

ఏకధారగా వర్షం చినుకులు నెత్తిమీద పడుతున్న గమనించని రమేష్ బట్టలు బాగా తడిసి

చలిపుడుతున్నప్పుడు గ్రహించాడు, తను బాగా తడిసిపోయినట్టు.

క్రిందభూమి బాగా తడిసిపోయింది. ఆతాటాకు చిల్లుల్లోంచి వాననీరు టుపుక్కున ఒక్కొక్క బొట్టుపడుతోంది. ఒక్కొక్కచోట ఏకధారగా వర్షం. తడకగోడలోంచి జల్లు గదిలోకి వస్తోంది. తడక తలుపు గాలికి ఎడాపెడా కొట్టకొంటోంది వర్షం గదిలోకి వస్తోంది.

ఝుమ్మన ఈదురుగాలి తోలింది. రోడ్డుమీద ఎలెక్ట్రిక్ దీపంకాంతిలో వర్షం చినుకులు మెరుస్తూ కురుస్తున్నాయి. పట్టణం నిశీధ నిశ్శబ్దంలో నిద్రపోతోంది. పోలీసుల విజిల్సు రెండోమూడో వినిపించాయి. కారుచీకటి ఆకాశాన్ని క్రమ్మివేసింది.

ఈదురుగాలి తోలింది. వళ్ళు పులకరించింది. చలి పుట్టింది. పైగా బట్టలన్ని తడిసిపోయాయి పాడుచలి! చంపుకు తింటోంది. అసలు వంటరిజీవితం కూడదు చాడీశ్వరి—చాడీశ్వరి పాపిష్టి పీనుగ!

ఈదురుగాలి తోలింది. ఎదురుగా ట్రంకుపెట్టె వుంది. దాంట్లో బట్టలున్నాయి. అదిమాత్రం తడిసి వుండవు. వెలుపలవున్న బట్టలు తడిసిపోయాయి. పొడి బట్టలేదు. చలిపుడుతోంది. ట్రంకులోంచి బట్టలు తీసి వేసుకోవచ్చు దుప్పటి కప్పుకోవచ్చు.

వర్షం బాగా కురుస్తోంది. బట్టలు వేసుకున్నా, దుప్పటికప్పుకున్నా తడిసిపోతాయి బటలు పెట్టెలోంచి తీయటం అనవసరం. అలాగ్గే తడినసిచాపమీద కూర్చున్నాడు.

పాడుకొంపలు! అద్దెపుచ్చుకోనేంతవరకేగాని కప్పిద్దామనే ఉద్దేశ్యమే వుండదు వీళ్ళకి ఛీ! ఈమురికి పేటలోని యిళ్ళన్నీ యింతే!

ఈదురుగాలి. చలికినరాలు వోలకర్పుకు పోతున్నాయి. తనచుట్టూ నీరు ముట్టడించింది. చలిత్వర పెడుతోంది.

తళుక్కున కత్తిమెరసింది!

అది చావాల్సిందే! తనని ఎన్నివిధాల ఉపయోగించుకోవచ్చో అన్ని విధాలా ఉపయోగించు కొంది. అది తనని నమ్మింది కదా అని తనువూహించ నైనా వూహించని, తనకుజరిగిన ఈ ద్రోహాన్ని నిదర్శన పూర్వకంగా విన్నికళ్ళారచూశాడు. ఒక వేళ దానిదగ్గర తప్పులేదనుకోవచ్చు. అయితే అనల్లాడు ఎందుకు దాని మేడదగ్గర కాస్తున్నాడు. ఇది సమాధానం దొరకని ప్రశ్న! దాన్ని హతమారిస్తే తప్పతనకు నిద్రపట్టదు.

టంగుమని మ్రోత!

తత్తిరపోయాడు రమేష్! కత్తికోసం వెతికాడు. చుట్టూచూశాడు.కన్పించలేదు. చేతిని చూచుకున్నాడు చేతిలోవుంది. రెండోగంట మ్రోగలేదు రెండోగంట వినిపిస్తుందేమోనని నిరీక్షించాడు, కాని విన్పించలేదు.

తాలూకాలోంచి కాపలావాడు మ్రోగించిన గంట అది. టైం ఒంటిగంట! తను రెండుగంటలకు పనిపూర్తి చేసుకోవాలి అది తననిర్ణయం ఏర్పాటు! ఇంకొక్క గంటటైము!

వెగవకాలం ఒకసార్త్వర పెడుతుంది. ఉత్సాహమిస్తుంది. మరొక్కసారి నిరుత్సాహ పరుస్తుంది. ఇంక గంటదాకా తనేమీ చేయకూడదు.

ఈదురుగాలి చలికి బట్టలు దోహదమిచ్చాయి. నరాలు కొరుక్కు తింటోంది నేడుచలి.

ఇలాంటి వర్షాకాలం. ఈదురుగాలి.చలికాలం. తనిప్పటికి ముప్ఫైకిపైగా దాటాడు. ఇంతబాన తనే చలికాలంలోను పడలేదు.

చాడీశ్వరితో దాదాపు నాలుగు ఇంలాటి చలికాలాలు. సరిగ్గా ఇలాంటి పూరికొంపల్లోవుండి చలి మరిచిపోయాడు.

జేబు కొట్టిన నేరంతో జైలు శిక్షననుభవించి, ప్రారంభిస్తున్న క్రొత్త యవ్వనంతో బయటకు వచ్చిన తొలి దినాల్లో తను చాడీశ్వరిని కలుసుకున్నాడు. అప్పటికామె ఫలానా వాడిభార్య అనబడే స్థితిలో వుంది. దానితండ్రి ఎవరో అప్పట్లో తనకు తెలియదు. లైసెన్సుకూలీ రాఘవకు, కొంచెం వయస్సు పైబడిన వాడు, దాని పెనిమిటి. జైలు గోడల్లోంచి విశాల విశ్వంలోకి వచ్చిన తనకు నచ్చింది, చాడీశ్వరి. అంతే దాన్ని తీసుకొచ్చి మరో పట్టణంలో కాపరం పెట్టాడు తను. ఏ ఇబ్బందీ లేకుండా జేబులు కొట్టే వ్యాపారంలో దాదాపు నాలుగు సంవత్సరాలు కదిలిపోయాయి.

అయితే కాలగమనం సాఫీగాసాగలేదు. ఆమస్య వక్రించింది.

ఈదురుగాలి తోలుతోంది. వర్షం పడుతోంది.

తలమీదపడిన వర్షంనీరు చెంపల మీదుగా ముఖం మీదుగా, జారుతోంది. తుడుచుకున్నాడు రమేష్.

పుటుక్కు పుటుక్కున పైనించి వర్షం చినుకులు పడుతున్నాయి. తడికగోడ జల్లు వేగానికి తట్టుకోలేక పోతోంది. ఒక్క వూపుతో వర్షమూ, గాలీ వచ్చి తడిక తలుపు నెట్టాయి. తలుపు తెరుచుకుంది. వర్షం గదిలోకి వస్తోంది. రమేష్ లేచి తలుపు దగ్గరకు నెట్టి మళ్ళీ వచ్చి తడి చాపమీద కూర్చున్నాడు.

తను ఇలాంటి మూడు చలికాలాలు చాడీశ్వరికి దూరంగా వర్షానికి తడవకుండా, చలికి బాధపడుతూ, జైలు గోడలమధ్య గడిపాడు.

తను జైలుకు పోయింది కూడా దాని కోసమే. ఆనాడది బజారులో బట్టలు షాపులో కనబడ్డ ఆ జరీ చీర కావాలని కోరటమే తప్పు. అదికోరింది బాగానే వుంది. ఆడదానికి అలంకారాలమీద ప్రేమ కదా! తన తెలివి తేట లేమయ్యాయి?

తను దాన్ని దొంగిలించటంలో తెలివి తక్కువ పని చేశాడు. పోనీ దొరికిపోయినప్పుడు వూరుకున్నా పోయేది. రోషంతో షాపువాడ్ని చెట్నీ చేశాడు. తరవాత తన వీపు పగిలిపోయింది. ఐదారునెల్లతో తప్పిపోవాల్సిన జైలు శిక్షమూడు సంవత్సరాలకు పెరిగింది.

నిజంగా ఆ మూడు సంవత్సరాల్లో ప్రభుత్వం తన కెంతో అపకారం చేసింది. జీవిత గమనాన్ని మార్చింది. పురోగమనం కాదు. తిరోగమనం. చెడ్డమార్గంలోకి నడిచాడు, దొంగల్ని కాపాడే జైలులోంచి బైటకు వచ్చిన రమేష్.

విసురుగా ఈదురుగాలి తోలింది. తలుపు తటపటా కొట్టుకుంది. నరాన్ని కాలేసినట్లు చలి పుడుతోంది. టప్పున దీపం ఆరిపోయింది.

జైలుగోడలు. అరుసులు. చలి. బాధ. పోలీసులు. ఇనప కటకటాల నీడలు. దొంగలు. రౌడీలు. హంతకులు. మూలులు. అరుపులు,ఘోషలు. బూటులటకటకా. గుడ్డిదీపాల వెలుగు నీడలు. తాలూకాలోంచి గంటల మ్రోతలు. టవున్లోంచి రేడియో వాగుడు. కలకలాలు. వరుసగా చిత్రంలాగా కదిలిపోయాయి. అన్నీ పూర్వస్మృతులు.

ఉరుమురిమింది. మెరపు మెరిసింది. ఎదురుగా వున్నకత్తితళుక్కుమంది. చీకటిలో, చలిలో, కత్తిమీద చేయి వత్తిపట్టాడు రమేష్. ఎదురుగావున్న చెక్కపెట్టి మీద పెట్టాడు.

హత్యచేయటం నేర్పింది చాడీశ్వరి! దొంగతనం చేయటం మాత్రం నేర్పలేదు. హత్య చేయటానికి పురికొల్పింది. ఉత్సాహపరిచింది. అది నేర్పినవిద్యకు అదే బలికాబోతోంది.

దాని బలవంతంమీద ఆనాడు తను వాణ్ని ఆనాడు హత్యచేశాడు.

తన అభిమతం ప్రకారం తనంత తను చాడీశ్వరీని హత్యచేయబోతున్నాడు నేడు.

తను మూడు సంవత్సరాలు జైలు జీవితం గడిపాడు. బయటికి వచ్చిన మూణ్నెల్లకు కూడా తను ఆమెను చూడలేకపోయాడు. అప్పుడది స్వంత కారులో బీచ్ కి బయలుదేరింది. ఆరోజు దాన్ని చూచినప్పుడు కూడా పోల్చుకోలేకపోయాడు.

చాలా ప్రయత్నం చేసింతరవాత, ఆ కారు వలన యింటిలో ఒకనాడు దాన్ని కలుసుకున్నాడు. మాట్లాడాడు. మాట్లాడింది. వినీలాకాశంలో స్వేచ్ఛగా విహరించే పావురం బంగారు పంజరంలోంచి మాట్లాడినట్లు. ఇప్పుడు ఆమె ఒక ధనవంతుని భార్య.

తర్వాత చాటుమాటుగా నాలుగైదు నెల్లు తను చాడీశ్వరిని కలుసుకుంటుండే వాడు. ఆ కాల వ్యవధిలో ఆమె, భర్త మరణానంతరం భార్య ఆస్తికి వారసులయ్యేట్లు వీలునామా వ్రాయించుకుంది. ఆపైన తనని పురికొల్పింది పెనిమిటిని హత్య చేసేందుకు.

తను ఆ ధనవంతుని హత్యచేశాడు.

తనమీద నేరం లేకుండా పోయేందుకు మరి రెండు హత్యలు చేయవలసి వచ్చింది. ఆపనులు ముగించుకున్నాడు.

ప్రాణంమీద తీపివలన ప్రవాసం పోవలసి వచ్చింది. నిరాశాపూరిత హృదయంతో వెళ్ళిపోయాడు

ఈదురుగాలితో చలి పుట్టింది.

ఒక ఈదురుగాలి చలికాలం పోయిందాకా తను ప్రవాసంలోనే ఉండవలసి వచ్చింది.

మళ్ళీ చాడీశ్వరి దగ్గరకు చేరుకున్నాడు.

అప్పటి కామె ఆ ధనవంతుని పేరిట వైధవ్యం పుచ్చుకుంది. ఆస్తికి వారసురాలైంది.

చలిగాలి కొంచెం తగింది. వర్షం తిరుగుముఖం పట్టింది. ప్రచండంగా గాలీ లేదు. ప్రళయంగా వానా లేదు.

ఆపైన చుట్టుప్రక్కల వాళ్ళు అనుమానించటం జరుగుతోంది. పల్లెవిడిచి, పట్టణం వచ్చి, వ్యాపారం చేసి, లాభమూ, పేరు ప్రఖ్యాతులూ పొందిన ధనవంతుని దూరంచటం రమేష్. ఇలా తను చాడీశ్వరి మేడలోనే దాదాపు మూడు వర్షాకాలాల చలిరోజుల్లో గడిపాడు.

ఇద్దరికి వున్న సంబంధం శంకించటం జరిగింది. ఆ విషయం తనకుకూడా తెలుసు. ఒకనాడు తను దాన్ని అడిగాడు 'ఈ వూరు విడిచేద్దామని.' అది 'వద్దు, ప్రమాదం' అంది. తనాపైన ఏమీ మాట్లాడలేదు.

ఒకనాడు తను వూహించని విధంగా జరిగింది. అది తనకు ఏ కారణమూ చెప్పలేదు. కాని నెలదాకా మేడవైపు రావద్దంది. తను ఏ అవసరమోనని దాని ఆజ్ఞను శిరసావహించాడు. నెల పోయిం తరువాత దాన్ని కలుసుకున్నప్పుడు అది పలకడమే ప్రళయమైపోయింది.

తను దానిదగ్గరకు పోవటం, తిరిగి నిరుత్సాహముతో రావటం, నిన్నటిదాకా చేస్తున్నాడు. అనుకున్నప్పుడు, అవసరమున్నప్పుడు అడిగింది పొందలేకపోతున్నాడు. ఒకొక్కసారి అడగడానికే అవకాశం లేకుండా పోతోంది.

నిన్న ఉదయం వాడు ఇంట్లోకి పోవడం తను కళ్లారా చూశాడు. వాడలా నాలుగు సంవత్సరాలుగా వస్తున్న సంగతి నిర్నన పూర్వకంగా తెలుసుకొని ఈ నాడు ప్రత్యక్షంగా చూశాడు. హృదయం పగలగోసినంత బాధపడ్డాడు.

ఉరుమురిమింది! మెరుపు మెరిసింది! కత్తి తళుక్కుమంది!

'ఇవాళ ఇది దానిగుండెల్లో దూసుకుపోవాలి'

కోపంతో ముడుచుకున్న పిడికిలి విప్పి, కత్తి పిడిమీద పెట్టాడు రమేష్.

పటిష్ఠమైన తనకాళ్లు వణుకుతున్నాయి. కుడికన్ను అదురుతోంది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. శరీరంలో ఏదో తొందర తొందరగా వుంది.

తన విజ్ఞానాన్ని పూర్తిగా కూడదీసుకొని ఆలోచిస్తున్నాడు. పూనికతో మునిగాళ్లమీద నిలబడ్డాడు.

దీపం ఆరిపోయి వుంది!"

వెలిగించాలి!

జేబు వెతికాడు. రెండో, మూడో పుల్లలున్న అగ్గిపెట్టె తడిసివుంది!

'దీపం వెలిగించకపోతే ఏం?' తనలో తాననుకున్నాడు రమేష్.

చీకటి—ఆకాశంలో, భూమిమీద, భూగోళములో, ప్రపంచంలో—అంతా చీకటి. చుట్టూచీకటి. గదిలో చీకటి. హృదయంలో చీకటి చీకటికన్నుకొలుక కంటినీరు జారుతున్నట్లు ఒకొక్కబొట్టు వర్షం పడుతోంది.

టంగుటంగున తాలూకాలోంచి రెండు గంటల మ్రోతలు వినిపించాయి.

వంటికి కరెంటు అంటించినట్లయింది. అసంకల్పిత ప్రతీకార చర్యకు అలవాటుపడ్డ కండరాలు టక్కున రమేష్‌ని పైకి లేపాయి. వంగి పెట్టెమీద కత్తి అందుకున్నాడు. గుడ్డదిసి కత్తికి చుట్టి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు.

బయలుదేరబోయాడు!

చలిగాలి తోలింది. బయట వర్షం ఒకొక్కబొట్టు పడుతూనే వుంది. తన వంటిమీద బట్టలు తడిసివున్నాయి. చివరకు కత్తికి చుట్టిన బట్టకూడా తడిసింది. పొడిబట్టలు పెట్టెలో వున్నాయి.

జేబులో కత్తి చేతికి కదిలింది. తనకు వెంటనే హత్యవిషయం గుర్తుకొచ్చింది. బటల వ్యవహారం ఆలోచిస్తూ కాలం వ్యర్థం చేయకూడదు. వేసుకుంటే పొడిబట్టలు వేసుకోవటం. లేకపోతే లేదు. ఇక్కడ ఎక్కువ ఆలోచన పనికిరాదు హత్య జరుగవలసిన కాలమూ — దాని ఏర్పాట్లూ సక్రమంగానే వున్నాయి. తానిక్కడ బటలు మార్చుకుంటూ కూర్చుంటే కాలం—ముహూర్తం—దాటిపోతుంది. ఆపైన పని జరగదు.

వెంటనే బయలుదేరాలి!

చలిగాలి!

రమేష్ ఎందుకో వెనుకంజ వేశాడు. మళ్లా అతన్ని ఏదో ఆలోచన చుట్టుముట్టింది. ఈ హత్య

సంపూర్ణంగా విజయవంతమౌతుందని తనకు నమ్మకం లేదు. ఉన్న పరిస్థితీ, ఆలోచించుకున్న విధానమూ, స్థూల దృష్టికి బాగానే వున్నాయి. కాని నిశితంగా పరిశీలిస్తే ఏదో లోపము వున్నట్లు తనకు క్షణక్షణమూ శంక కలుగుతూనే వుంది.

ఒక వేళ ఈ హత్యతో తను దొరికిపోవటం జరిగితే మళ్లీ స్వెటరు వేసుకోవటం జరగదు. ఆమఫ్లర్ ని మళ్ళీ చూడలేడు. ఇవాళే ఇస్త్రీనుంచి వచ్చిన ఆ ఖరీదైన పాంటూ, షర్టూ తను చూడ్డం తటస్థించదు. వాటిని వేసుకోవలసిందే!

అతని ఆలోచన కార్యరూపం ధరించింది. పొడి గుడ్డ కత్తికి చుట్టాడు. అతనికి వెంటనే గుర్తుకొచ్చింది. ఎంత చెడ్డా తను చాడేశ్వరి యింటికి వెళుతున్నట్లు. నిద్రలో వున్నప్పుడు దాన్ని హత్యచేయటం కుదరక మేలుకునే వున్నప్పుడు చేయవలసివస్తే అది తనని చూచి ఏవగించుకునేట్టు గానీ, అనుమానించేట్టు గానీ వుండకూడదు.

ఈ విషయం గుర్తుకు రాగానే చెక్క పైకెతిసి, అద్దాన్ని అందుకొని అలా వదిలేసి, దువ్వెన బైటికి తీసి, చూపుడు వేలితో పాపిటతీస్తూ తల దువ్వుకున్నాడు.

జేబులో కత్తి చేతికి తగిలింది. అతనికి జరగవలసిన విధానమంతా అలా చిత్రంలాగా మనః ఫలకంలో మెదిలింది. వెంటనే బయలుదేరాడు. కాలికి ముక్కాలిపీట తగిలింది. గడితలుపు వేశాడు. రోడ్డుమీదకు వచ్చాడు.

ఎక్కడో కుక్క మొరిగింది. దూరంగా తీతువు కూసింది. పొలిమేరల్లో నక్క అరచింది. నిశీధి గురక పెట్టి నిద్రపోతోంది.

రమేష్ నడుస్తున్నాడు!

పాడు చలి! మెడమీదవున్న మఫ్లర్ చెవుల మీదగా తలకు చుట్టాడు. రెండు జేబుల్లో చేతులు పెట్టుకున్నాడు. కత్తి చేతికి తగిలింది.

నడుస్తున్నాడు!

రెండోఆట సినీమా అన్ని హాలుల్లో వదలిపెట్టారు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. నిశాకన్య జడలాంటి తారురోడ్డుమీద, కొప్పులోని పువ్వుల్లాంటి గుడ్డిదీపాల కాంతి పడి మెరుస్తోంది. ఇక్కడే కొంచెం వెలుగు.

నడుస్తున్నాడు!

చాడేశ్వరి ఆ కిటికీ దగ్గరగా నిద్రపోతుంది. ప్రక్కనున్న గొందిలోంచి, కిటికీ ఎక్కి, చెక్కలు నెట్టి, లోపలికి చొరబడి, నిద్రపోతున్న చాడేశ్వరిని పడకమీదే కత్తికి బలి యివ్వాలి.

ఆ ఆలోచనతో జేబులోని కత్తి గట్టిగా నొక్కి పట్టాడు. పళ్లు పటపటలాడించాడు. గట్టిగా భూమిని వత్తిపట్టి నడుస్తున్నాడు.

నడుస్తున్నాడు.

రోడ్డు! రోడ్డుమీంచి దాటితే మలుపు. మలుపు తిరిగితే సందు. సందులోంచి నాలుగుబారల దూరంలో మేడ. మేడప్రక్కగా గొంది. గొందిలోంచి కిటికీ మీదకు మార్గం. కిటికీలోంచి గదిలోకి. గదిలో......

జేబులో కత్తికంటే ముఖంలోని పెదాల్ని గట్టిగా నొక్కిపట్టాడు రమేష్. బలంగా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ పోతున్నాడు.

నడుస్తున్నాడు!

మలుపుతిరిగాడు. సందు దాటాడు. గొందిలోకి పోయాడు. కిటికీ ఎక్కాడు. కూర్చున్నాడు. ఇక లోపలికి దూకబోతున్నాడు. పడకవైపు చూశాడు. ఆశ్చర్యం! పడకమీద ఆమె లేదు. ఖాళీగావుంది. పరిశీలనగా చూశాడు. మసకవెలుగు. పడక బాగా నలిగి వుంది. తలుపుదగ్గర శబ్దమైంది. అటువైపు చూశాడు, కిటికీలో చెక్కప్రక్కగా నక్కి కూర్చున్న రమేష్. చాడేశ్వరి నిద్రకళ్ళతో తలుపు గడియ వేసింది. పడక వైపు నడుస్తోంది. ఆమె పడక పైన మేను వాల్చిందాకా రమేష్ చూశాడు. ఆ పైన వెనుదిరిగాడు. కిటికీలోంచి మెల్లగా దిగి, గొందివిడిచి, సందుదాటి, మలుపుతిరిగి మేడనుంచుకువచ్చి రోడ్డువైపు పరిశీలనగా చూశాడు రమేష్.

ఫర్లాంగుదూరంలో-రోడ్డుమలుపుతిరిగి మెయిన్ రోడ్డులో కలిసేచోట-మునిసిపాలిటీ ఎలెక్ట్రిక్ లైటు నీడలో, ఒక పురుషుడు కదిలిపోతున్న నీడను చూశాడు రమేష్. రమేష్ అప్రయత్నంగా పెదాలు కదిపాడు. 'వాడ్ని పంపించివేసింది. ఆ వల్లకోటువాడు'

తను రోజూ రాత్రి రెండూ మూడూ గంటలప్పుడు వచ్చి, తిరస్కరింపబడి తిరిగిపోతున్నాడు. కొన్ని సార్లు తలుపుతీయకుండానే పొమ్మనేది. కొన్ని

పార్లు కసురుకొనేది. తిట్టేది. చివాట్లు పెట్టేది. ఏడుస్తూ చెప్పేది. లాలనగా బ్రతిమాలేది. డబ్బు ఇచ్చేది. మరి కొన్నిసారు తనకువచ్చే నాలుగుమాటలు చెప్పి, మభ్య పెట్టి వెళ్ళిపొమ్మనేది. మొత్తంమీద తనని వెళ్లగొట్టేది. ఎక్కువసేపు మాట్లాడేదికూడా కాదు.

ఇవాళ అలా కుదరదు. తను నాలుగు రోజుల నాడే ప్లాను వేశాడు. ఇవాళ వంటమనిషిని పంపేస్తుంది. దాని భర్తకు దూరంచుట్టమైన తను కలకతా వెళిపోయినట్లు కావలసినంత సాక్ష్యం. ఆ వచ్చినవాడుకూడా వెళ్లిపోయాడు.

ఇప్పుడు యింట్లో అది ఒక్కతే!

జేబులో కత్తి గుర్తొచ్చింది. అది పరలోక యాత్ర చేస్తుంది.

అది మేలుకొనేవుంది. కిటికీలోంచి దూకి కార్య భంగం పొందేకంటే రోజూ వచ్చేవాడివే కనుక మామూలుగానే వాకిట్లోంచి పోయి, చేయదల్చుకున్న పని చేయటం శ్రేయస్కరం.

పోయి తలుపుతట్టాడు. సమాధానం రాలేదు.

మళ్లా తట్టాడు. జవాబు రాలేదు. కొంచెం సేపాగాడు. అది లేచినట్లుగానీ, నడిచినట్లుగానీ, తలుపుతీసే పద్ధతి వున్నట్లుగానీ తనకేమీ తెలియటం లేదు.

మళ్ళీ తలుపు తట్టాడు. బదులు లేదు.

పెద్దగా తలుపుమీదకొట్టి 'చాడీ' అని కేకేశాడు. ఆమె పలకలేదు. తలుపుతీయలేదు.

రమేష్ అక్కడ నిలవదలుచుకోలేదు. వెనుదిరిగి పోయి, చరచరా మునుపటి కిటికీలో కూర్చుని చాడీశ్వరి పడకవైపు చూశాడు.

ఆమె మంచంమీద విలాసంగా పడుకుంది. నుదుటిమీద ముంగురులు కదలాడుతున్నాయి. మసక వెలుగులో చెక్కిలి ముద్దొచ్చేట్టుంది. శ్వాస సమంగా వస్తోంది.

చలిగాలికో, ఆమె విలాసవైఖరికో అతని వీపు పులకరించింది.

మెల్లగా కిటికీదగ్గరగా దిగాడు.

ఆకాశంలోలేని చంద్రబింబం చాడీశ్వరి వదనంలో మెరుస్తోంది.

చల్లగా, పిల్లిలాగా, అడుగుల్లో అడుగులు వేసుకొంటూ రెండోగదిలోకివెళ్లి లైటు వేశాడు. సన్నని దీపం వంటింట్లో వుంది.

చాడీశ్వరి పడకగది ప్రక్కనున్న గదిలోని వెలుగును పంచుకొంది. ఆమె లేవలేదు. ఆమె ముఖంమీద వెలుగుకిరణాల శాతం పెరిగింది. శరీరంమీదకూడా వెలుగు పడుతోంది

కోక! ఆశ్చర్యపోయాడు రమేష్. తను దాన్ని కలుసుకున్న మొదటిరోజుల్లో కట్టుకోమని కొని యిచ్చిన పట్టుకోక! ఇవాళ కట్టుకుంది. దానికున్న కోకల్లో యిది ప్రాణతుల్యమైంది. ఇవాళ వాడికోసం కట్టుకుంది.

తాళి! నిలువునా చలించిపోయాడు రమేష్. తను తన చేతులతో దాని మెడలోకట్టిన తాళిలేపుకొచ్చిన రోజుల్లో. ఆరు సంవత్సరాలుగా అది దాని మెడలో తను చూడలేదు. చీరె దొంగిలించిన నేరంతో జైలుకుపోతూ చూశాడు. ఇప్పుడు మళ్ళా చూడగలిగాడు. వీడెవడో దౌర్భాగ్యుడు లాగున్నాడు. తాళి కూడా కొనలేని బాపతు.

గాజులు! చేతులికి గాజులున్నాయి. రాక్షసుడికి లాగా కోపం ముంచుకొచ్చింది. పిచ్చికోపం.

చాడీశ్వరికదిలింది. కొంచెం పక్కగా వొత్తిగిలి పడుకుంది. రమేష్ వెనక్కు తగ్గాడు.

జడ! పూలు!! జడవేసుకుంది. జడలో పూల మాల తురుముకొంది.

ఇవాళ పునిస్త్రీ వేషం. వాడితో లేచి పోడానికా? లేక ఈ వేషంతో ప్రతిరోజూ వాడికి దర్శనమా? పళ్ళు పటపట లాడించాడు రమేష్.

జేబులో కత్తి చేతికి తగిలింది.

కత్తి పైకి తీశాడు. తళుక్కుమని మెరిసింది.

పొడవడానికి వుంకించాడు.

వెన్నుముక మీద ఎవరో బలంగా చరిచినట్లైంది. త్రుళ్ళిపడి వెనక్కు తగ్గాడు.

చాడీశ్వరిని ఇప్పుడు పొడవ్వచ్చు. చనిపోతుంది. ఆ విషయంలో ఆటంకమేమీ లేదు. కాని తను దాన్ని పొడిచిం తరవాత కూడా ఆ వస్తున్న వాడెవడో తనకు తెలియదు. వాణ్ని తెలుసుకోకపోతే లాభం లేదు. తెలుసుకోవాలి. దీన్ని లేపాలి.

తను కనుక్కోదలుచుకున్న విషయంతో నిజంగా తనకు ప్రమేయం లేదు. వాడెవడైనా తను చేయగలిగింది కూడా ఏమీ లేదు. తనకు అవసరంలేని ఆ విషయాన్ని తెలుసుకోక పోయినా ఫరవాలేదు. వాడికీ దీనికీ సంబంధం వుండటం ఖాయం. దీని చెడు ప్రవర్తనకు ఇదే బలి కాబోతుంది. వాడితో తన కేమిటి? దీన్ని పూర్తిచేయాలి.

కత్తి పైకెత్తాడు!

చాడీశ్వరి కదిలింది!

ఇది చేసుకున్న ఏ పుణ్యమో దీని జీవిత ప్రమాణం కొన్ని సెకండ్లు పెంచుతోంది, హాయిగా నిద్ర పోనిచ్చేందుకు. ఇది ఏమైతేనేం కొంచెం కదిలింది. దీన్ని లేపి, వాడెవడో? ఎందుకు వస్తున్నాడో? తేల్చుకోవాలి. దాని సమాధానాలు తను నమ్మడు.

తను దాన్ని లేపేది, అది చెప్పేది వినేందుకు. అది చెప్పింది తను విన్నా, నమ్మడు. చంపటం ఖాయం. మరి లేపట మెందుకు?

దీన్ని లేపి, తన కింత ద్రోహం చేసినందుకు, శక్తిలేని దానిగాచేసి, మాట్లాడ నివ్వకుండా, కదల నివ్వకుండా, అరవ నివ్వకుండా చేసి, చూస్తూ వుండగానే గుండెల్లో కత్తి గుచ్చాలి!

తనలో ఎందుకు రెండు రకాల భావాలు కలుగుతున్నాయో అర్థం కావటంలేదు. తను ద్వంద్వాతీతుడు. దీన్ని చంపటం ఖాయం. లేపటం అవసరం.

కత్తికి గుడ్డచుట్టి జేబులో పెట్టుకున్నాడు. లైటు వేశాడు.

ఆమె వీపుమీద చేయివేసి చిన్నగా 'చాడీ' అని పిలిచాడు.

ఆమె పక్కకు వొత్తిగిలింది. దుప్పటి తీసి పూర్తిగా కప్పుకుంది.

'చాడీ!' పిలిచాడు రమేష్. ఆమె మెల్లగా కళ్ళు విప్పి, అతన్ని చూచి మళ్ళీ ముసుగు తన్నింది.

'చాడీ!' మళ్ళీ పిలిచాడు.

చాడీశ్వరికళ్లు తెరచి, రమేష్‌ని గూచి 'మీరా' అని కళ్లుమూసి, మూస్తూ, తెరుస్తూ 'నిలుచున్నారేం కూర్చోండి!' వెనక్కు జరిగి, వెంటనే దుప్పటి తొలగించి, వాకిలి వైపు చూచింది. వేసిన గడియ వేసినట్లే వుంది. 'ఎలా వచ్చారూ?' తియ్యగా ప్రశ్నించింది నవ్వు ముఖంతో.

రమేష్ కిటికి వైపు చూశాడు. ఆమె కూడా అటు చూచింది. కిటికీ తీసివుంది.

'ఏం అలా వున్నారూ?' ముఖంలోకి చూచి 'ఏం ఇలా వచ్చారూ?' కిటికీ లోకిచూచింది. వెంటనే తనే మాట్లాడింది. 'నాకోసమా?' నవ్వింది. రమేష్ మారు పలక లేదు.

ఆమె మళ్ళీ ప్రశ్నించింది, 'నువ్వీవాళ కలకత్తా వెళతానన్నావు. నేనువద్దు అన్నా. వినలేదే అనుకున్నా. విన్నావన్న మాట?!' పకపకా నవ్వింది.

'నోర్ముయ్' పెద్ద పులిలాగా అరిచాడు రమేష్ వెంటనే ప్రశ్నించాడు. 'ఎవడు వాడు?' ఆమెవైపు చూశాడు. 'జవాబు చెప్పు'

'ఎవడు వాడు?' చిలిపిగా నవ్వుతూ మృదువుగా రమేష్ కళ్ళల్లోకి చూచింది చాడేశ్వరి.

'నల్లకోటువాడు. రోజూ యింటికివచ్చి వెళ్ళే వాడు. ఇప్పుడింట్లోంచి పోయినవాడు. ఎవడు వాడు? ఏకధాటిగా అడిగాడు రమేష్.

సున్నితంగా అతని భుజాలమీద చేతులు వేసింది. సౌమ్యంగా, మృదువుగా, లాలనగా చెక్కిళ్ళమీద మునివేళ్ళతో తాకింది.

రమేష్ వళ్ళు జలదరించింది. గగుర్పొడిచింది. పులకరించింది. వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

రివ్వున చలిగాలి రివట వచ్చింది.

వళ్ళు మునగర దీసుకుపోయింది. ఆమె రెండు భుజాలూ బలంగా పట్టుకున్నాడు రమేష్. పట్టలేని తమకంతో ఆమె పెదాలు ముద్దుపెట్టుకున్నాడు. వేడి నిశ్వాస.

చాడేశ్వరిని దగ్గరకు లాక్కున్నాడు. మెడ చుట్టూ చేతులు పెనవేశాడు. షాక్ ! షాక్ కొట్టినట్లు వదిలిపెట్టాడు. దూరంగా జరిగాడు. ప్రశ్నించాడు 'ఎవడు వాడు?'

'ఇంటి ప్లీడరు.' ఆమె జవాబు చెప్పింది. అతని దగ్గరగా జరిగింది. అతను దూరంగాపోలేదు.

'అయితే ఎందుకొస్తున్నాడు?' మెత్తబడ్డాడు. మెల్లగానే అడిగాడు.

'ఆస్తి హక్కులు అన్నీ నాకివాళ వచ్చాయి– వచ్చినట్లే- ఇన్నినాళ్ళనుంచీ ఆ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవాళతో పూర్తయింది.' ఆమె గంభీరంగా పలికింది, తలగడక్రిందవున్న ఏవో కాగితాల కట్ట తీసిచూపింది.

'అయితే ఇవన్నీ ఏమిటి?' రమేష్ ప్రశ్నించాడు, వాటివైపు చూస్తూ.

'ఆస్తికి సంబంధించిన దస్తావేజులు మొదలైనవి' కాగితాలు తలగడక్రింద భద్రంగా పెట్టింది.

ప్రక్కగదిలో ఏదో శబ్దమైంది

'ఏమిటది? నిర్లిప్తంగా అడిగాడు రమేష్.

'ఏమో' అని పెద్దగా జవాబుచెప్పి, వంటగదివైపుచూచి, 'వెధవ పిల్లులు' అని లేచిపోయింది. మళ్ళీ తిరిగి వచ్చేసింది.

ఆపైన కొంచెంసేపు గది నిశ్శబ్దంగావుంది.

రమేష్ మాటలే నిశ్శబ్దాన్ని చీల్చివేశాయి. అతను ప్రశ్నిస్తూనే నవ్వుతున్నాడు! . ఈ ప్రశ్నకు మాత్రం తను సమాధానం తెలుసుకుతీరాలి. 'ఈ వేషమేమిటి?'

ఆమె టపీమని జవాబుచెప్పింది మృదువుగా. 'నీకోసం, నీ ఆనందంకోసం' అతని మెడకు చేతులు చుట్టింది. 'ఇవాళనుంచి మనం అడ్డులేని...'

'పక్షులం' పూరిచేశాడు రమేష్ చాడేశ్వరి చెక్కిలి స్పృశిస్తూ-

తలుపు తట్టినధ్వని.

రమేష్ తత్తరపోలేదు.

తలుపుతీసింది చాడేశ్వరి.

పడకమీంచి లేచి కత్తిజేబులో చెయిపెట్టుకు నిలబడ్డాడు రమేష్.

'ఇంటివద్ద లేడు' బయట కంఠం

రమేష్ వింటున్నాడు. ఎవరికోసం పంపిందో, మళ్ళా కోపంవస్తోంది.

'వచ్చాడు లే' చాడేశ్వరి సమాధానం చెప్పింది.

రమేష్ కొంచెం తగ్గాడు.

'రమేష్ వచ్చాడా?' బయట స్త్రీ కంఠం.

'వచ్చాడులే నువ్వుపో' తలుపు గడియవేసి వచ్చింది, చాడేశ్వరి.

'ఎవరది' రమేష్ ప్రశ్నించాడు పడకమీద కూర్చుంటూ

'వంటది, నిన్ను పిలుచుకురాను పోయింది. ఇంటివద్ద లేవని వచ్చిచెబుతోంది' పడకమీద కూర్చుంది.

'నేను కలకత్తా వెళ్ళలేదని నీకెలా తెలుసు?' అనుమానంగా అడిగాడు.

'కలకత్తా రిజర్వుచేసిన మీ టిక్కెట్టుమీద వంటదాని పింతల్లికొడుకు వెళ్ళుతున్నట్లు తెలిసింది. వాడీపాటికి కలకత్తా చేరివుంటాడు.' ముఖంలోకి చూస్తూ 'అవునుకదూ?'

'అవును చేరివుంటాడు' ఆమెను చూస్తూ 'నేనింటివద్దే వున్నట్లు నీకెలా తెలిసింది' ముఖం దించుకున్నాడు.

'నువ్వు మొదటిపోకి వచ్చి, రూం కెళ్ళినట్లు వంటమనిషి చెప్పింది. అది రెండోఆటకూడా చూచి నా దగ్గర కొచ్చింది. నీ విషయం చెప్పింది. నిన్ను పిల్చుకురమ్మని పంపాను. ఇంతలో నువ్వు వచ్చావు' ఆమె చెప్పటం ముగించింది.

అయితే నేనెప్పుడేం చేస్తుందీ నీకు తెలుసునన్నమాటా?! అనుమానంగా అడిగాడు. అయితే అది ప్రశ్న.

'ఆపైన ఇంకేమీ తెలియదు.' ప్రశ్నకోరని జవాబు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

రమేష్ చాడీశ్వరిని హత్య చేయదలచుకున్న కారణం ఆమెముందు పెడుతూ సామాన్యంగా మొదలెట్టి ప్రశ్నించాడు. 'చాడీ! ఇన్నాళ్ళుగా నన్నెందుకు నీరసిస్తున్నావ్? ఎందుకు చాడీ'

ఆమె హృదయంలోంచి మాట్లాడింది. మెత్తగా, మృదువుగా, తియ్యగా, 'ఆస్తి మనపేరిట వచ్చేందుకదంతా తతంగం రమ్మీ!' అతని తొడమీద తలపెట్టుకుంది.

'చాడీ!' చెక్కిలిరాస్తూ 'నిజం చెబుతున్నాను' ముఖంలోకి చూచి 'నిన్నివాళ హత్య చేద్దామనుకున్నాను. అందుకే వచ్చాను.'

'హత్యా!' చాడీశ్వరి అంది. తత్తరపోయిందనుకున్నాడు రమేష్. 'అవును' సమాధానం చెప్పాడు. 'కాని హృదయాన్ని మార్చిన మగువనన్ను మరో లోకంలోకి నెట్టేసింది!' ముంగురులు సవరిస్తూ 'అంతా మరిచిపోయాను.'

'నన్ను అన్యాయం చేస్తావా?'

'ఇంకానా?' ఆమె పెదాలని మృదువుగా స్పృశించాడు.

'ఉండుండు! ఆగమంటే?' ఆమె లేచింది. రమేష్‌కు ఎదురుగా గోడమీద శృంగార రస స్వరూపిగా చిత్రించిన కాళికాదేవి పటం అలంకరింపబడి కనిపించింది. ఆమె వంటగదివైపు పోయింది.

ఒక్క నిముషంలో వచ్చింది.

బయట వర్షం పడటంలేదు. కిటికీలోంచి చలిగాలి దూకింది. కురిసిన వర్షం నీటితో మురుగుకాలువ వొడ్డులు వొరుసుకొంటూ పరుగెతుతోంది. వెంటనే జేబులోంచి కత్తిదీసి మురుగు కాలువలో విసిరాడు.

'బాబో!' అంది చాడీశ్వరి.

'ఇక భయంలేదు చాడీ!' లైటు ఆఫ్ చేసి దగరగా వచ్చి రెండు భుజాలూ గటేగా పట్టుకొని పడకమీద కూర్చొబెటి, ప్రక్కనే కూర్చున్నాడు.

ప్రక్కగదిలో ఏదో అలికిడయింది. రమేష్ గమనించలేదు.

ఆమె అతని ప్రక్కగా కూర్చుని ముద్దు పెట్టుకొంటూంది.

ప్రక్కగదిలోంచి అలికిడి, మనిషి నడుస్తున్నట్లుంది. వాళ్ళున్న గదిలోకి వచ్చినట్లయింది.

రమేష్ ఏదో అలికిడి అనుకున్నాడు. తలెత్తి ప్రక్కకు చూద్దామనుకున్నాడు. చాడీశ్వరి ముద్దు పెట్టుకొంటూనే వుంది. 'చూడకపోతే ఏం' అనుకున్నాడు రమేష్.

ఆమె ఒక్కసారి పెద్దిగా దగ్గింది.

ఎవరో వ్యక్తి నడుస్తున్న శబ్దం సుకరంగా వినవస్తోంది.

రమేష్ రెండుభుజాలమీద చేతులు వేసి. బలంగా ముద్దు పెట్టుకొంటోంది చాడీశ్వరి.

లేవబోయాడు. ఆమె అతని భుజాల్ని వత్తి పట్టింది. అతనింకా ప్రయత్నం చేస్తూనే వున్నాడు.

వంటగదినుంచి, హాలుదాటి, పడకగదిలోకి, మనిషినడిచి వస్తున్న సవ్వడి చక్కగా వినిపిస్తోంది. రమేష్ లేవటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు.

రమేష్ రెండుచేతులు చాడీశ్వరి మెడకు చుటాడు. ఆమె సర్రున పైకి లేచింది. విదిలించి వేసింది చాడీశ్వరి.

కిటికీతలుపు చాడీశ్వరి మూసింది. కిటికీవైపు చూశాడు.

తలుపు తెరుచుకుంది. తత్తరపోయాడు. తలుపువైపు చూశాడు. వాడు—నల్లకోటు వాడు. వాడిచేతిలో కత్తివుంది. గుండెలకు గురి చూస్తున్నాడు.

కిటికీవైపు చూశాడు. మూసివుంది. చాడీశ్వరి వికటంగా నవ్వుతోంది. తలుపువైపు చూశాడు. తీసివుంది. తళతళలకత్తివాడు ముందుకొస్తున్నాడు.

చాడీశ్వరి వికటంగా నవ్వుతోంది! వాడు మీదకొచ్చాడు!